వరి సాగు తగ్గలేదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి వ్యవసాయ శాఖ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): గత వానకాలంతో పోల్చితే ఈ వానకాలంలో వరి సాగు ఉత్పత్తి తగ్గలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'పెరిగిందెక్కడ? తగ్గుడే' శీర్షికన ప్రచురితమైన వార్తకు వివరణ ఇచ్చారు. గత వానకాలం సీజన్‌లో 65.92 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 144.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు పేర్కొన్నారు. ఈ వానకాలంలో తుది అంచనాల ప్రకారం 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 156.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు వెల్లడించారు. బియ్యం ఉత్పత్తి గతంలో 97.65 లక్షల టన్నులు ఉండగా, ఈ సీజన్‌లో 103.61 లక్షల టన్నులు ఉత్పత్తి అయినట్టు వివరించారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

- బీసీ నేత ఆర్ కృష్ణయ్య డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబర్8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకుంటే 10వ తేదీన కలెక్టర్లు, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసి మీడియాకు విడుదలచేశారు. బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని 1800 కాలేజీలు బంద్ చేపట్టాయని, అయినా సర్కారు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అనేక స్కీములు, కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం వద్ద.. విద్యార్థుల మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించేందుకు బడ్జెట్ లేదా? అని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ల ముట్టడిలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమ్మెలోకి సమగ్ర శిక్షా ఉద్యోగులు

- రేపటి నుంచి చాక్‌డౌన్, పెన్‌డౌన్

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తేతెలంగాణ): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి చాక్‌డౌన్, పెన్‌డౌన్ చేసి నిరసన తెలపనున్నారు. సమ్మెలో జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల్లోని వొకేషనల్ ఇన్‌స్ట్రక్చర్ సిబ్బంది పాల్గొనున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శులు ఝాన్సీ, సౌజన్య తెలిపారు. కాగా, సిబ్బంది సమ్మెలోకి వెళ్తుండటంతో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, భవిత కేంద్రాల్లో బోధన నిలిచిపోనున్నది.

ఆసిఫాబాద్‌లో టైగర్ జోన్ ఆలోచనే లేదు

- పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ జోన్ కారిడార్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్‌ఏలు ఏలుసింగ్ మేరు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌తో అటవీశాఖ అధికారులు ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డోబ్రియాల్ మాట్లాడుతూ టైగర్ జోన్ చేసే ఆలోచన లేదని, పదంతులను నమ్మొద్దని తెలిపారు. అడవులు, వన్యప్రాణులను సంరక్షించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు.

కార్యాలయాలకు టీ-ఫైబర్ సేవలు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే టీ-ఫైబర్ ద్వారా అందించే ఇంటర్నెట్/ఇంట్రానెట్ సేవలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సేవలకు ధరలు నిర్ణయించినట్టు, వాటిని చెల్లించి ఉపయోగించుకోవాలని సూచించారు. 50ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌కు ఏఆర్‌సీ(యాన్యువల్ రికరింగ్ చార్జెస్) రూ.10,800, లాస్ట్ మైల్ ఓఎఫ్‌సీ కనెక్షన్‌కు రూ.9,500 నిర్ణయించినట్టు చెప్పారు. కనెక్షన్ కోసం టీ-ఫైబర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీపాల్‌రెడ్డికి టీఆర్టీఎఫ్ మద్దతు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్టు టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ ప్రకటించారు. ఈ మేరకు మద్దతు లేఖను ఆదివారం శ్రీపాల్‌రెడ్డికి అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాధాన్యంగా విజయోత్సవాలా!

- పార్టీ పాలసీ ఒకటైతే మీరు చేస్తున్నదేమిటి?
- ముఖ్యనేతను నిలదీసిన సీనియర్ మంత్రి
- పునరంకిత సభల స్థానంలో స్వోత్కర్ష సభలా అంటూ మండిపాటు
- ఇవి వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే సభలని అసంతృప్తి
- ప్రగతి నివేదికలపై సహాయ నిరాకరణ చేసిన సీనియర్ మంత్రులు
- వ్యవసాయ శాఖ నుంచి వెల్లడి కాని ప్రగతి నివేదిక

హైదరాబాద్, డిసెంబర్08 (నమస్తే తెలంగాణ): ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పుడు పునరంకిత సభలు పెటుకోవడం కాంగ్రెస్ పార్టీ ఆనవాయితీ అని, కానీ రాష్ట్రంలో విజయోత్సవ సభల పేరుతో వ్యక్తిగత గొప్పలు, స్వోత్కర్ష వేదికలుగా మారుస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ మంత్రి ఒకరు ముఖ్యనేతకు ఎదురు తిరిగినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇది పార్టీ పాలసీకి విరుద్ధమని తెగేసి చెప్పినట్టు సమాచారం. కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో పునరంకిత సభలు పెట్టారని.. ఆ సంస్కృతిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనసాగించారని ఆయన గుర్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. ఈ మేరకు ఇటీవల ఓ జిల్లాలో జరిగిన బహిరంగ సభ అనంతరం సీనియర్ మంత్రి తన అసంతృప్తి వెళ్లగక్కినట్టు తెలిసింది. పాలనా వైఫల్యాలపై ఆత్మ విమర్శ చేసుకుంటూ.. సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకుంటూ, ఇందిరమ్మ స్ఫూర్తితో మరింత మెరుగైన పాలనకు దిశానిర్దేశం చేసుకోవటం కోసం పునరంకిత సభలు జరుగుతాయని సదరు మంత్రి గుర్తు చేసినట్టు తెలిసింది. ఆ దిశగా ఇప్పటి వరకు ఒక్క సభ కూడా జరుగలేదని, కేవలం వ్యక్తి ప్రాధాన్య సభలు మాత్రమే జరుగుతున్నాయని, దేవుండ్ల మీద ఒట్లు, కేసీఆర్‌కు తిట్లు అన్నట్టు తప్ప కాంగ్రెస్ పార్టీని, భవిష్యత్తు పరిపాలనను పరిపుష్టి చేసుకునే విధంగా ఒక్క సభ కూడా సాగలేదని ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ నేతగా తాను ఇటువంటి సభలను సమర్థించలేనని తెగేసి చెప్పినట్టు తెలిసింది.

తప్పుడు సమాచారంతో ప్రజల్లోకి వెళ్లలేం

ఏడాది పాలన ప్రగతి నివేదికలు రూపొందించటంపై కూడా సీనియర్ మంత్రులు తమ సహాయ నిరాకరణ తెలియ చేసినట్టుగా తెలుస్తోంది. ఏడాది పాలనలో ఏమి అభివృద్ధి సాధించామని ప్రగతి నివేదికలు తయారు చేయాలని, తప్పుడు సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకొని ప్రజల్లోకి వెళ్లి అబ్బాసుపాలు కాలేమని ఐదుగురు సీనియర్ మంత్రులు తెగేసి చెప్పినట్టు నిర్దిష్టంగా తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయశాఖ నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదిక బహిర్గతం కాకపోవటంతో ముఖ్యనేత, సీనియర్ మంత్రుల మధ్య సంవాదం జరిగిందనే వాదనకు బలాన్నిస్తోంది. ఈ మేరకు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని సూచలిచ్చినట్టు సమాచారం. విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చే విధంగా ప్రోగ్రెస్ రిపోర్టు ఉండాలని ముఖ్య నేత దిశానిర్దేశం చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయం, సివిల్ సప్లై, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలకు చెందిన మంత్రులు ప్రగతి నివేదికలు ఇవ్వటానికి ఇప్పటి వరకు ముందకు రాలేదు. రూ 2 లక్షల రుణమాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించగా.. తమకు రుణమాఫీ కాలేదంటు వేల కొద్ది రైతు కుటంబాలు రోడ్డెక్కుతున్నాయి. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000, రైతు భరోసా మీద ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయలేకపోతున్న నేపథ్యంలో ప్రగతి నివేదికలు ఎలా ఇవ్వాలని సదరు శాఖ మంత్రి ముఖ్యనేత వద్ద తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఉడికిపోతున్న ఉత్తమ్

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదికలు బహిర్గతం చేయలేదు. ఈ రెండు శాఖలకు ఒకే సీనియర్ మంత్రి ఉండటం గమనార్హం. సదరు మంత్రికి, ముఖ్య నేతకు మధ్య అసలు పొసగటం లేదని గాంధీభవన్ వర్గాలే చెప్తున్నాయి. ముఖ్య నేత కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను ఆయన పెడ చెవిన పెడతారని, తన శాఖలో వేరొకరు వేలు పెట్టడానికి ఇష్టపడరనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది పాలనలో నీటి పారుదల రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనే అభిప్రాయంతో సదరు మంత్రి ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒక్క సాగు నీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం కానీ, పురోగతిలో ఉన్న ప్రాజెక్టుకు నిధులు కేటాయించటం కానీ చేయలేదని, కేవలం లగచర్ల పారిశ్రామిక కారిడార్‌ను దృష్టిలో పెట్టుకొని మొదలు పెట్టిన కొడంగల్ లిఫ్ట్ పనులకు మాత్రమే నిధులు ఇవ్వటంతో సదరు శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి విచారణకు ఆదేశించటం మిన హా.. కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేయటానికి రూపాయి నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలోతాను ఎటువంటి ప్రగతి నివేదికలు పట్టుకొని ప్రజల ముందుకు వెళ్లాలని సదరు మంత్రి ప్రశ్నించినట్టు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ నుంచి కూడా ఏడాది పాలన మీద ఇప్పటి వరకు ప్రోగ్రెస్ రిపోర్టు వెల్లడి కాలేదు. ఆ శాఖలో కొత్తగా వేసిన రోడ్లు ఏమీ లేకపోవటం, కనీసం పాత రోడ్లను రిపేర్ చేయడానికి నిధులు కేటాయించక పోవటంతో సదరు మంత్రి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచకుండా మొఖం చాటేశారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

మళ్లీ వీఆర్వో వ్యవస్థ

- పాత వీఆర్వోలు, వీఆర్‌ఏల సర్దుబాటు
- గ్రామ రెవెన్యూ అధికారులుగా పునరుద్ధరణ
- 4.68 లక్షల 'భూ' దరఖాస్తులు పరిష్కరించాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): గ్రామ స్థాయిలో మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గతంలో వివిధ శాఖల్లోకి సర్దుబాటైన వీఆర్వోలు, వీఆర్‌ఏల్లో ఎంపి కచేసిన వారిని మళ్లీ 10,954 రెవెన్యూ గ్రామాల్లో నియమిస్తామని చెప్పారు. మరో వెయ్యి మందిని సర్వే సెటిల్‌మెంట్ విభాగంలోకి తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన ఆర్వోఆర్ చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని ప్రకటించారు. 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న మంచి అంశాలను నూతన చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ఏడాది కాలంలో ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన అనేక చర్యలు చేపట్టామని, మాడ్యూళ్లను మార్చామని, తాసిల్దార్లకు, ఆర్డీవోలకు, అదనపు కలెక్టర్లకు అధికారాలు ఇచ్చామని తెలిపారు. నిర్వహణ బాధ్యతను టెర్రాసిస్ సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసీకి అప్పగించామని చెప్పారు. కొత్త చట్టం తర్వాత ధరణి పోర్టల్‌లో 11-14 మాడ్యూళ్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడత స్థలం ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేస్తామని, రెండో దశలో ప్రభుత్వమే స్థలంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎంపీ బలరాంనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఎన్ని రోజులు సభ నిర్వహించాలో సోమవారం జరుగనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నారు. కొత్తగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ బిల్లుపైనే ఉన్నది. దీంతోపాటు తెలంగాణ వైద్యవిధాన పరిషత్తును ప్రభుత్వంలో విలీనం చేసి సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చే బిల్లును సైతం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. సమావేశాల ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖతో అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని సూచించారు. కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, డీజీపీ జితేందర్, ఏడీజీ మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు చర్చకు వచ్చే అంశాలు

1) జీతాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్ 2024
2) తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్ 2024
3) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్ 2024
4) తెలంగాణ వస్తువుల, సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్ 2024
5) 2022-23 సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ లిమిటెడ్ 9వ వార్షిక నివేదిక
6) 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 7వ వార్షిక నివేదిక
7) తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్స్ 2024

రాష్ట్రానికి 7,592 కోట్ల పెట్టుబడులు

- ప్రభుత్వంతో 3 కంపెనీల ఒప్పందాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు 3 కంపెనీలు ముందుకొచ్చాయి. రూ.7,592 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీల ద్వారా దాదాపు 5,200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, డైరెక్టర్ మల్లూర్ తదితరులు పాల్గొన్నారు.

3 కంపెనీల పెట్టుబడుల వివరాలు		
కంపెనీ	పెట్టుబడి	ఉద్యోగాలు
ఆజాద్ ఇంజనీరింగ్	800 కోట్లు	600
ప్రీమియర్ ఎనర్జీస్	5,292 కోట్లు	2,500
లెన్స్‌కార్ట్	1,500 కోట్లు	2,100
మొత్తం	7,592 కోట్లు	5,200

మీ-సేవ మొబైల్ యాప్ ఆవిష్కరణ

అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీ-సేవ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. పౌరసేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఇందులో మొత్తం 150 రకాల పౌరసేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ యాప్ ద్వారా ప్రజలు ఏ సమయంలోనైనా, ఎక్కడినుంచైనా వివిధ రకాల సేవలను పొందవచ్చని చెప్పారు. త్వరలో మాల్స్, ఎయిర్‌పోర్టులు, మెట్రో స్టేషన్లు, సమీకృత కలెక్టరేట్లు తదితర ప్రాంతాల్లో మీ-సేవ కియోస్క్‌లను ఏర్పాటు చేయనున్నామని, మీ-సేవ ద్వారా లభ్యమయ్యే సేవలను ఈ కియోస్క్‌ల ద్వారా కూడా పొందవచ్చని తెలిపారు.

టీ-ఫైబర్ సేవలు ప్రారంభం

టీ-ఫైబర్ ఇంటర్నెట్ సేవలను కూడా మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన ఇంటర్నెట్ ద్వారా సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో మాట్లాడారు.

మైనార్టీ గురుకులాల్లో అవకాశమివ్వండి

- ప్రభుత్వానికి కాంట్రాక్ట్ పీడీ, పీఈటీల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న చోట అవకాశమిచ్చి తమకు న్యాయం చేయాలని ఆ సొసైటీలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ పీడీ, పీఈటీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017 నోటిఫికేషన్ కింద సుమారు 190 మంది పీఈటీలు మైనార్టీ గురుకులాలకు ఎంపియ్యారని, ఈ నేపథ్యంలో తమను పక్కన పెట్టినట్టు గుర్తుచేశారు. పాఠశాలల్లో ఒకే సబ్జెక్ట్‌కు ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నప్పుడు.. స్కూల్ మొత్తానికి ఇద్దరు పీడీలు, పీఈటీలు ఉంటే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై హెడ్ ఆఫీస్, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మహాలక్ష్మి, రైతుభరోసా ఎప్పుడిస్తరు?

మహాలక్ష్మి, రైతుభరోసా పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను మహిళలు, రైతులు ప్రశ్నించారు. ఆదివారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లో గాంధీ విగ్రహావిష్కరణకు హాజరైన ఎమ్మెల్యే రోహిత్‌ను మహాలక్ష్మి పథకంపై మహిళలు, రుణమాఫీపై రైతులు నిలదీశారు. జనవరిలో రైతుభరోసా ఇస్తామని ఎమ్మెల్యే వారికి సమాధానం చెప్పారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని కూడా అందిస్తామంటూ అక్కడి నుంచి జారుకున్నారు. - చిన్నశంకరంపేట

'పీఎంశ్రీ'లకు అంగన్‌వాడీ పిల్లల్ని పంపండి?

- అంగన్‌వాడీ టీచర్లపై ప్రభుత్వ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల ఒత్తిడి
- నేటి నుంచి 74 స్కూళ్లలో పీఎంశ్రీ ప్రీప్రైమరీ క్లాసులు ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): నేటి నుంచి రాష్ట్రంలోని 74 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 'పీఎంశ్రీ' ప్రీ ప్రైమరీ క్లాసులు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆరేండ్లలోపు పిల్లల కోసం ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి పిల్లల్ని తీసుకురాలేక అంగన్‌వాడీ పిల్లలను టార్గెట్ చేస్తున్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇందుకు సంబంధించిన సంఘటన నల్లగొండ జిల్లాలోని వెలిమినేడు ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్నది. అంగన్‌వాడీ పిల్లలను పీఎంశ్రీ క్లాసులకు పంపిస్తే అంగన్‌వాడీలు ఉనికి కోల్పోతాయని, అదే జరిగితే తమ భవిష్యత్తు ఏంటని? అంగన్‌వాడీ టీచర్ల సంఘం రాష్ట్ర నాయకురాలు నిర్మల ఆందోళన వ్యక్తంచేశారు. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నది.

విచారణ జరుపుతున్నాం..

పీఎంశ్రీ ప్రీ ప్రైమరీ క్లాసుల కోసం పాఠశాలల్లో పిల్లలు లేకపోవడంతో.. అంగన్‌వాడీ పిల్లలతో తరగతులు బోధించాలని విద్యాశాఖ అంతర్గత నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. దీనిని ఐసీడీఎస్ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, ఈ విషయంపై విచారణ జరుపుతున్నామని ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్ క్రాంతి వెల్లే 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అంగన్‌వాడీ పిల్లలను పీఎంశ్రీకి తరలింపు నిర్ణయం సరికాదని డైరెక్టర్ అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్‌ది చార్జిషీట్ కాదు..రిప్రజెంటేషన్: మంత్రి పొన్నం

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ విడుదల చేసింది చార్జిషీట్ కాదని, రిప్రజెంటేషన్‌గా భావిస్తున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంవత్సరం పాలన తర్వాత మమ్మల్ని విమర్శించినట్టుగా చార్జిషీట్ చేసినా బాగుండేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే ప్రభుత్వాన్ని విమర్శిస్తూ.. చార్జిషీట్ విడుదల చేయటం భావ్యంకాదని తెలిపారు. ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు డిస్‌చార్జిషీట్ ఇచ్చారు: మంత్రి పొంగులేటి

బీఆర్ఎస్ పదేండ్ల పాలనపై ఏడాది క్రితమే తెలంగాణ ప్రజలు డిస్‌చార్జిషీట్ ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకి ఇంకా జ్ఞానోదయం కాకపోవడం విచారకరమని, వారి వాలకం దొంగే దొంగా అన్నట్టుగా ఉన్నదని పేర్కొన్నారు. పదేండ్ల పాలనలో వందేండ్లకు సరిపడా దోపిడీ చేసిన వారే ఇవాళ చార్జిషీట్ అంటున్నారని తెలిపారు.

చార్జిషీట్ల పేరుతో మరో డ్రామా: సీతక్క

అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతుంటే, దాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్, బీజేపీలు చార్జిషీట్ల పేరుతో డ్రామలాడుతున్నాయని పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. సలహాలు, సూచనలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న పన్నాగాలతో బీఆర్ఎస్, బీజేపీలు పనిచేస్తున్నాయని తెలిపారు. 54 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, రూ.21 వేల కోట్ల రైతుల రుణమాఫీ వంటి ఎన్నో హామీలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు.

తెలుగులో ఈ నెల 13న బ్రహ్మాండమైన విడుదల
PLV CREATIONS
RELEASING ON 13TH DEC
PL VIGNESH
ప్రణయగోదారి
PRODUCER LINGAIA